ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 03-09-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో ఈ మధ్యాహ్నం జరిగే ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారు.
2. శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ రోజు ప్రకటించారు.
3. కేంద్ర ప్రభుత్వం ఇతర దేశాల నుంచి తగినంత యూరియా దిగుమతి చేసుకోకపోవడం వల్లే కొరత ఏర్పడిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు.
4. రెండు రోజుల పాటు జరిగే GST కౌన్సిల్ 56వ సమావేశం ఈ ఉదయం న్యూఢిల్లీలో ప్రారంభమైంది.

------------------------

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చంద్రుగొండ మండలం, బెండాలపాడు గ్రామంలో ఈ మధ్యాహ్నం జరిగే ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన బెండాలపాడు గ్రామంలో 310 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. నిర్మాణం పూర్తి అయిన 25 ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం పైలాన్ ను ఆవిష్కరించి.. దామరచర్లలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రత

ఏర్పాట్లు చేసింది. సుమారు 1,200 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్తగూడెం - వీఎం బంజరు మధ్య ట్రాఫిక్ పై ఆంక్షలు విధించారు.

**PTC-B.KGM**

------------------------------

**చంద్రుగూడ - పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగూడ మండలం బెండాలపాడు గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పేదవారి సొంతింటి కల నెరవేరబోతుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. బెండాలపాడు గ్రామంలో జరగబోయే ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల ఏర్పాట్లను మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతమైన బెండాలపాడు గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం ఒక చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు.

**పీటీసీ - భద్రాద్రి కొత్తగూడెం**

------------------------------

**ముఖ్యమంత్రి**

మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలంలో ఉన్న SGD ఫార్మా రెండో యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి బయలుదేరారు. ఆయన వెంట మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఉన్నారు.

**పీటీసీ – మహబూబ్ నగర్**

------------------------------

**కవిత**

శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఈరోజు హైదరాబాద్‌లోని

తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. భారత రాష్ట్ర సమితిలోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని కవిత ఆరోపించారు. తనపై పెట్టిన అక్రమ కేసుల కారణంగా తీహార్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చానని, అనంతరం ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు.

**----------- బైట్ కవిత -----------**

**డెస్క్**

**------------------------**

**హైదరాబాద్ ఐఐటీ**

ఆర్థిక సాంకేతికత - ఫిన్‌టెక్, సైబర్ భద్రత రంగాల్లో మెరుగైన ఆవిష్కరణలను పెంపొందించే లక్ష్యంతో హైదరాబాద్ ఐఐటీలో నిర్వహిస్తున్న ఫిన్ షీల్డ్ హ్యాకథాన్ 2025 సదస్సు ఈరోజు ముగియనుంది. ఈ సదస్సును భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఐఐటి నిర్వహిస్తోంది. ఈ హ్యాకథాన్ పోటీలకు దేశ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి 72 ఆవిష్కరణలు వచ్చాయి. 18 ఆవిష్కరణలు తుది పోటీలకు ఎంపికయ్యాయి.

**SANGAREDDY-PTC**

----------------------------

**మీడియా అకాడమీ- వర్క్ షాపు:**

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ - AI ఆధునిక ప్రక్రియలపై వర్కింగ్ జర్నలిస్టుల కోసం తెలంగాణ మీడియా అకాడమీ హైదరాబాద్‌లో ఈ ఉదయం వర్క్ షాప్ నిర్వహించింది. అకాడమీ అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి వర్క్ షాపును ప్రారంభిస్తూ, త్వరలో పూర్తిస్థాయిలో రాష్ట్రంలోని ఇతర ప్రాంత జర్నలిస్టులకు కూడా AI టూల్స్ పై వర్కషాపును నిర్వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్టు, AI tools శిక్షకులు U సుధాకర రెడ్డి AI సాంకేతిక అంశాలపై అనేక విషయాలను వర్క్ షాపులో వివరించారు.

**MSL**

---------------------------

**తుమ్మల**

కేంద్ర ప్రభుత్వం ఇతర దేశాల నుంచి తగినంత యూరియా దిగుమతి చేసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఢిల్లీలో ఈ ఉదయం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదని, దేశ వ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారని విమర్శించారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు ఇంకా సరఫరా చేయలేదన్నారు. యూరియా కొరత కారణంగా రాష్ట్ర రైతులు ఆందోళనలో ఉన్నారని మంత్రి తెలియజేశారు.

**డెస్క్**

-----------------------------------

**GST COUNCIL MEETING**

GST కౌన్సిల్ 56వ సమావేశం ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహిస్తారు. భవిష్యత్ GST సంస్కరణలపై కౌన్సిల్ చర్చిస్తుంది. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... వస్తువులు, సేవల పన్ను దేశానికి ప్రయోజనం చేకూర్చిందని, సామాన్యులు, రైతులు, మధ్యతరగతి MSME లకు ఉపశమనం కలిగించేలా భవిష్యత్ లో GSTలో మార్పులు ఉంటాయని చెప్పిన విషయం తెలిసిందే.

**ఎస్ ఎస్ డీ**

--------------------------------

**మిడ్ మానేరు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మన్వాడ వద్ద గల మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్ ఎం డి జలాశయానికి నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు డి ఈ రాజు తెలిపారు. మిడ్ మానేరు జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి 14 వేలు, ఎగువ మానేరు నుంచి 3210 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. జలాశయం నుంచి ఎల్ఎండీకి 7500 క్యూసెక్కులు, అన్నపూర్ణ జలాశయానికి 9,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామన్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

---------------------------------

**నిర్మల్ - ఎస్సీ కాలనీలు**

నిర్మల్ నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఐదు కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పనులను పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షిస్తుందని తెలియజేశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

**పిటిసి నిర్మల్ జిల్లా**

-----------------------

**గ్రామపంచాయతీ ఓటర్ల ముసాయిదా**

సంగారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయతీ రెండో విడత సాధారణ ఎన్నికల ఓటర్ల జాబితా తుది జాబితాను ప్రచురించినట్లు జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాలను పంచాయతీల్లో ప్రదర్శిస్తారని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సైతం ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. యాదాద్రి

భువనగిరి జిల్లా పరిధిలోని 427 గ్రామ పంచాయతీలలో ఓటర్ల తుది జాబితా ఈరోజు విడుదలైంది.

**పీటీసీ, సంగారెడ్డి - రాజన్న సిరిసిల్ల - యాదాద్రి భువనగిరి**

--------------------------

**వాతావరణం**

ఈరోజు నుంచి ఐదు రోజుల పాటు రాష్ట్రంలో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

**పీఎస్**

------------------------

**లోక్ అదాలత్**

జనగామ జిల్లాలో ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడేందుకు వీలున్న కేసులను పరిష్కరించుకోవాలని జనగామ జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ C విక్రమ్ కోరారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకారం ముఖ్యమని అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో ఉన్న మీడియేషన్ సెంటర్ ఉపయోగించుకోవాలని సూచించారు.

**పీటీసీ - జనగామ జిల్లా**

---------------------------

CHHATTISGARH - MAOISTS

ఛత్తీస్ గ ఢ్ లోని బీజాపూర్ జిల్లాలో గత 24 గంటల్లో 16 మంది మావోయిస్టులను భద్రతాదళాలు అరెస్టు చేశాయి. జిల్లా రిజర్వ్ గార్డ్ , కేంద్ర సాయుధ పోలీస్ సిబ్బంది జిల్లాలో మావోయిస్టు ఏరివేత చర్య నిర్వహించారు. ఈ ఆపరేషన్ , బసగుడ ప్రాంతం నుంచి ఇద్దరు

మావోయిస్టులను, గ్యాంగ్లూర్ నుండి ఆరుగురు , జంగ్లా ప్రాంతం నుండి 8 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. వారి నుండి పేలుడు పదార్థాలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

NSD